హాస్టల్‌కు సరికొత్త హంగులు

- రూ.30 లక్షలతో ఏయూ హాస్టల్ ఆధునికీకరణ
- విద్యార్థినుల సౌకర్యార్థం పటిష్ట భద్రత చర్యలు



నూతనంగా నిర్మించిన టాయిలెట్స్



హాస్టల్ చుట్టూ నిర్మించిన ఇనుప కంచె



హాస్టల్ లోపల సుందరంగా భవనం



విద్యార్థుల గదులలో ఏర్పాటు చేసిన మంచాలు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో విద్యార్థినుల సంఖ్య ప్రతీ సంవత్సరం పెరుగుతోంది. దీనికి అనుగుణంగా అదనపు హాస్టళ్ల అవసరం ఏర్పడుతోంది. ఈ మేరకు ఇంజినీరింగ్ విద్యార్థినుల సౌకర్యార్థం కొత్త హాస్టల్ భవనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. విద్యార్థినుల భద్రతను పరిగణనలోనికి తీసుకుని ప్రత్యేక చర్యలు చేపట్టారు. హాస్టల్ భవనం చుట్టూ పటిష్టమైన గోడను నిర్మించి, భవనాన్ని పూర్తిగా ఆధునికీకరించి విద్యార్థినులకు కేటాయించారు.

96 గదులు.. 192 మంది విద్యార్థినులు

నూతనంగా విద్యార్థినులకు కేటాయించిన బ్లాక్ 4 హాస్టల్ భవనం మూడు అంతస్తుల్లో గుండ్రంగా ఉంది. దీర్ఘకాలంగా మరమ్మతులకు నోచికోని ఈ భవనాన్ని పూర్తిగా ఆధునికీకరించారు. అదే సమయంలో మొత్తం ఆరు టాయిలెట్స్ బ్లాక్‌లను అభివృద్ధి చేశారు. అధునాతన టైల్స్ వేసి కొత్తగా నిర్మించారు. హాస్టల్ బయట పూర్తిగా పాడైన నీటి సరఫరా, డ్రైనేజీ పైపుల స్థానంలో కొత్తవి అమర్చారు. పైఅంతస్తులో నీటి నిల్వకు అదనపు ట్యాంకులను ఏర్పాటు చేసి, దుస్తులు ఉతుక్కోవడానికి ప్రత్యేకంగా షెడ్ నిర్మించారు. ఇందు కోసం దాదాపు రూ.20 లక్షలకు పైగా వర్సిటీ ఖర్చుచేసింది.

భద్రతకు పెద్దపీట

హాస్టల్ భవనం చుట్టూ ఒకవైపు సిమెంట్ గోడను, మరో వైపు ఎత్తయిన ఇనుప కంచెను నిర్మించారు. భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ హాస్టల్ చుట్టూ రక్షణ గోడ ఏర్పాటు చేశారు. దీనికి దాదాపు రూ.9 లక్షలు వరకు ఖర్చు చేశారు. హాస్టల్ భవనంలో మొత్తం 96 గదులు ఉన్నాయి. వీటిలో 192 మంది విద్యార్థినులకు వసతి సదుపాయం కల్పించారు. ఒక్కో గదిలో ఇద్దరు విద్యార్థినులకు కేటాయించారు. అవసరమైన మంచాలను ఏర్పాటు చేశారు.

చాలా బాగుంది..



గతంలో యూజీ బ్లాక్‌లో ఉన్నాం. ఇటీవల ఈ కొత్త హాస్టల్‌కి మార్పు చేశారు. హాస్టల్ భవనం పూర్తిగా మరమ్మతులు చేసి కొత్తదానిలా తీర్చిదిద్దారు. అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించారు. గదుల్లో బెడ్‌లు సైతం చాలా బాగున్నాయి. హాస్టల్ పరిసరాలు, వాతావరణం బాగుంది.

– కె.దేవిక, సీఎస్ఈ ద్వితీయ సంవత్సరం

అన్నీ కొత్తగా ఉన్నాయి..



హాస్టల్‌లో వాష్‌రూమ్స్, టాయిలెట్స్ పూర్తిగా మార్పు చేశారు. అదే విధంగా భద్రత గురించి ఆలోచించి చుట్టూ రక్షణ గోడను నిర్మించారు. అధికారులు చొరవ తీసుకుని వీటిని ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉంది.

– కె.భావన, ఐటీ, ద్వితీయ సంవత్సరం

ఏపీ ప్రొఫెషనల్ బాక్సింగ్ కౌన్సిల్ అధ్యక్షుడిగా 'యల్లపు'



యల్లపు రఘురామ్‌ను అభినందిస్తున్న కౌన్సిల్ ప్రతినిధులు

దాబాగార్డెన్స్ : ఆంధ్రప్రదేశ్ ప్రొఫెషనల్ బాక్సింగ్ కౌన్సిల్ అధ్యక్షుడిగా యల్లపు రఘురామ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం నగరంలోని ఓ హోటల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఇండియన్ బాక్సింగ్ కౌన్సిల్ అధ్యక్షుడు మురళీధరణ్‌రాజా ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రొఫెషనల్ బాక్సింగ్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి మణిందర్‌సింగ్ పాల్గొని యల్లపు రఘురామ్‌ను నియమించారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా వాసుపల్లి అమ్మోరుతో పాటు కార్యవర్గ సభ్యులను నియమించారు. ఈ సందర్భంగా మణిందర్‌సింగ్ మాట్లాడుతూ ప్రొఫెషనల్ బాక్సింగ్ టోర్నమెంట్ నిర్వహించుకునేందుకు లైసెన్స్ జారీ చేసినట్టు చెప్పారు. ఈ సందర్భంగా ఇప్పటికే రెండు సార్లు ప్రొఫెషనల్ బాక్సింగ్ బౌట్స్‌లో పాల్గొని ర్యాంకింగ్ సాధించిన బాక్సర్లు కె. శ్రీను, భవానీప్రసాద్, గణేష్‌ను అభినందించారు. యల్లపు రఘురామ్ మాట్లాడుతూ క్లబ్ కోచ్‌లు, బాక్సర్ల సహకారంతో ప్రొఫెషనల్ క్రీడను ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో ప్రవీణ్‌కుమార్, గొర్లె చందు, డాక్టర్ బి. సునిల్, రూబెన్, యల్లపు పృధ్వీ, పలువురు కోచ్‌లు, బాక్సర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జీవీఎంసీ దఫేదార్ల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న దఫేదార్లు

ఆరిలోవ: జీవీఎంసీ దఫేదార్ల అసోసియేషన్ ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ముడసర్లోవ పార్కులో ఘనంగా జరిగింది. సుమారు 150 మంది దఫేదార్లు పాల్గొని ఉత్సాహంగా గడిపారు. ముఖ్యఅతిథిగా డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, అతిథులుగా పలువురు జీవీఎంసీ అధికారులు పాల్గొని దఫేదార్లతో సరదాగా గడిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ నారాయణ్, గణపతి, నరేష్, సింహాచలం, అప్పారావు, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా వైశాఖి దివ్యాంగ విద్యార్థి ట్రస్ట్ వార్షికోత్సవం

ఎంవీపీ కాలనీ: వైశాఖి దివ్యాంగ విద్యార్థి సేవా చారిటబుల్ ట్రస్ట్ 15వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. వెంకోజీపాలెంలోని సీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన వేడుకలో సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ మాట్లాడుతూ దివ్యాంగులకు ట్రస్ట్ అందిస్తున్న సేవలను కొనియాడారు. సమాజంలో ఇబ్బందులకు గురవుతున్న దివ్యాంగులకు ఆశ్రయం ఇచ్చి ఆదరిస్తున్న ఎన్జీవోలకు సహకారం అందించేందుకు ఈ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల నుంచి పదవీ విరమణ చేసిన వారంతా కలిసి ఈ ట్రస్ట్‌ను నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు శ్రీమన్నారాయణ తెలిపారు. ప్రతి నెలా ఒక దివ్యాంగుల ఆశ్రమాన్ని ఎంపిక చేసుకుని మంచి భోజనం, పోషకాహారం అందించడంతో పాటు అక్కడి వారికి అవసరమైన నిత్యావసరాలు, పరికరాలు, పుస్తకాలు, దుస్తులు ఇలా అన్ని సమకూర్చుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధి లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ ఏ సర్టిఫికెట్ పరీక్షకు 468 మంది హాజరు



సర్టిఫికెట్ పరీక్షకు హాజరైన ఎన్‌సీసీ విద్యార్థులు

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం ఎన్‌సీసీ ఏ సర్టిఫికెట్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షకు 468 మంది ఎన్‌సీసీ విద్యార్థులు హాజరయ్యారని కృష్ణా కళాశాల ఎన్‌సీసీ అధికారి లెఫ్ట్‌నెంట్ బి.సన్యాసిరావు తెలిపారు. ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ అరవింద్ నాగూర్ పర్యవేక్షణలో 13వ ఏ బెటాలియన్ ఎన్‌సీసీ కమాండర్ డి.టి. ఆంటోని నేతృత్వంలో ఈ పరీక్ష జరిగింది.

బాల్కానీ నుంచి జారిపడి వ్యక్తి మృతి



పవన్ కుమార్ మృతదేహం

బీచ్ రోడ్డు: ఓ హోటల్ బాల్కానీ నుంచి ప్రమాదవశాత్తు జారిపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన పవన్‌కుమార్(39) నగరానికి ఓ సమావేశం నిమిత్తం వచ్చారు. రామ్‌నగర్‌లోని ఓ హోటల్ మూడో అంతస్తులో అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. ఆదివారం తెల్లవారుజామున వాష్‌రూంకు వెళ్లేందుకు నిద్రమత్తులో బాల్కానీలోకి వచ్చాడు. అక్కడి నుంచి ప్రమాదవశాత్తు జారి కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. సమాచారాన్ని హైదరాబాద్‌లో ఉన్న కుటుంబ సభ్యులు తెలియజేశారు. నగరానికి వచ్చి వారు పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని హైదరాబాద్ తీసుకెళ్లిపోయారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పలమ్మవారి సన్నిధిలో అన్నదానం



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ



భక్తులకు అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

ఏయూ క్యాంపస్: జీవీఎంసీ 20వ వార్డు చినవాల్తేరులోని అప్పలమ్మ అమ్మవారి 58వ పరసను పురస్కరించుకుని ఆదివారం అన్నదానం నిర్వహించారు. విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ, 20వ వార్డు కార్పొరేటర్ ముప్పల లక్ష్మీ పాల్గొని ముందుగా అమ్మవారిని దర్శించుకున్నారు. బోనం సమర్పించి మహా అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంఘం పెద్దలు రాయల పాపారావు, పాలకొల్లు రాంబాబు, గుర్రాల రాజు, గుంటుబోయిన నరేష్, ఉరుకూటి మురళి, పాలకొల్లు నాని, మునగపాక రవికుమార్, గుర్రాల శ్రీను, గుర్రాల పవన్, పాలకొల్లు శంకర్, చంద్రన సాయి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆరిలోవ: విద్యుత్ విభాగం అధికారులు 33/11 కేవీ సబ్‌స్టేషన్ విమ్స్‌కు సంబంధించిన 11 కేవీ కైలాసగిరి ఫీడర్ నిర్వహణ పనులు చేపట్టనున్నందున సోమవారం పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది.

విశాలాక్షినగర్, రెవెన్యూ కాలనీ, కైలాసగిరి రోడ్డు, హనుమంతవాక కొండవాలు, బీఎస్ఆర్ నగర్, తోటగరువు ప్రాంతాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏపీ ఈపీడీసీఎల్ జోన్-3 ఈఈ పి.శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంతాల ప్రజలు గమనించాలని సహకరించాలని కోరారు.

విద్యతో పాటు మానవీయ విలువలు అవసరం



ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న శ్రీ సత్యసాయి విద్యావిహార్ ప్రతినిధులు

ఎంవీపీ కాలనీ: శ్రీసత్యసాయి విద్యావిహార్ 38వ వార్షికోత్సవం ఆదివారం ఎంవీపీ కాలనీలోని పాఠశాల ఆవరణలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఐఏఎస్ బసంత్‌కుమార్ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ విద్యా విహార్ విద్యార్థుల సేవా దృక్పథం వెలకట్టలేనిదన్నారు. చదువుతో పాటు విద్యార్థులకు సామాజిక స్పృహ, సేవా నిరతిని అందిస్తున్న శ్రీసత్యసాయి విద్యా సంస్థ కృషి అభినందనీయమన్నారు. నేటి సమాజంలో విద్యతో పాటు మానవీయ విలువలు అత్యంత అవసరమన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం స్కూల్ ప్లాస్ ప్రత్యేక సంచికను అతిథులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కౌసల్య, సత్యసాయి విద్యా విహార్ విద్యార్థిని, గాయని శిరీషాతో పాటు పలువురు సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

విమ్స్‌లో రోగుల రద్దీ



విమ్స్‌లో ఓపీ గదుల వద్ద నిరీక్షిస్తున్న రోగులు, వారి బంధువులు

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో రోగుల సంఖ్య కొద్ది రోజులుగా పెరుగుతోంది. రోగులతో పాటు వారికి సహాయంగా వచ్చే బంధువులతో ఇక్కడ ఓపీ గదులు కిటకిటలాడుతున్నాయి. ఇక్కడ అనుభవజ్ఞులైన వైద్యులు అందుబాటులో ఉండటం, వివిధ రకాల పరీక్షలు చేస్తుండడంతో రోగులు విమ్స్‌ను ఎక్కువగా ఆశ్రయిస్తున్నారు. అలాగే తక్కువ ధరకు ఎక్స్‌రే, రక్త పరీక్షలు, స్కాన్‌లు అందుబాటులో ఉన్నాయి. దీంతో ఇక్కడ ఓపీ సంఖ్య ఇటీవల పెరిగింది. గతంలో రోజుకు 500 లోపు ఓపీ ఉండేది. ఇప్పుడు ఓపీ సంఖ్య పెరిగి 600–700 మధ్య నమోదవుతోంది. నగరంతో పాటు విజయనగరం, శ్రీకాకుళం, తుని, రాజమండ్రి ప్రాంతాల నుంచి సైతం రోగులు వచ్చి విమ్స్‌లో వైద్య సేవలు పొందుతున్నారు. ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ, ఫిజియోథెరపీ, డెంటల్, జనరల్ విభాగాలలో ఎక్కువగా రోగులు వైద్య సేవలు పొందుతున్నారు. వీటికి సంబంధించిన శస్త్ర చికిత్సలే ఇక్కడ ఎక్కువగా జరుగుతున్నాయి.

అధ్యాపకులకు పదోన్నతి కోసం తీర్మానం

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జీసీజీటీఏ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులకు అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పించాలని తీర్మానం చేశామని జీసీజీటీఏ ప్రతినిధి జె.రామమూర్తి తెలిపారు. ఈ మేరకు ఉన్నత విద్యా శాఖ కమిషనర్‌కు కోరానున్నామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర, జిల్లా నాయకులు టి.రామచంద్రారెడ్డి, శ్రీనివాసరెడ్డి, టి.నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

సెయింటాన్స్‌లో ఉత్సాహంగా యూత్ ఫెస్టివల్



యూత్ ఫెస్టివల్‌లో పాల్గొన్న నిర్వాహకులు, విద్యార్థులు

ఆరిలోవ: ఆరిలోవలోని సెయింటాన్స్ పాఠశాలలో ఆదివారం యూత్ ఫెస్టివల్ ఉత్సాహంగా సాగింది. ఈ వేడుకల్లో అధిక సంఖ్యలో విద్యార్థినులు నృత్యాలు, పాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ చీఫ్ జనరల్ మేనేజర్ ఇమిత్రియాజ్ అర్షద్ మాట్లాడుతూ దేశ నిర్మాణానికి యువత మూల స్తంభమన్నారు. క్రమ శిక్షణతో కూడిన యువత దేశానికి అవసరమన్నారు. యువత ప్రతి పనిలోను నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రావెన్సియల్ మేరీ ఏంజిల్, కౌన్సిల్ ఇన్‌చార్జి అనిత, యూత్ కోఆర్డినేటర్ సుజాత, ఆరిలోవ, మల్కాపురం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, విజయనగరం, రాజాం, శ్రీకాకుళం ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర సహకారంతోనే సంక్షేమ పథకాల అమలు



మాట్లాడుతున్న జీవీఎల్

ఎంవీపీ కాలనీ: కేంద్రం అందిస్తున్న సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు అన్నారు. లాసన్స్ బే కాలనీలోని బీజేపీ కార్యాలయంలో పల్లెకు పోదాం(గావ్ చలో అభియాన్)పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలంతా గావ్ చలో అభియాన్ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని, అభివృద్ధిని వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుమలరావు, మేడపాటి రవీంద్ర పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు సూచనలిస్తున్న ద్వారకా సీఐ రమేష్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఫోర్త్‌టౌన్ ఎస్ఐ వెంకటరావు

సీతమ్మధార: ద్వారకా పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు సీఐ రమేష్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తగాదాలు, గొడవల్లో తలదూర్చితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎటువంటి నేరాల జోలికి పోకుండా మంచిగా నడుచుకోవాలని సూచించారు. మద్యం షాపుల వద్ద గొడవలు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడు ఉంటుందని గుర్తుంచుకుని సత్ప్రవర్తనతో నడుచుకోవాలని రౌడీషీటర్లకు సీఐ రమేష్ సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐలు శ్రీను, ధర్మేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

- ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు ఎస్ఐ వెంకటరావు కౌన్సెలింగ్ చేశారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబాలతో కలిసి హాయిగా జీవించాలని హితవు పలికారు. మీరు చేసే పనులపై ఎప్పటికప్పుడు పోలీస్ నిఘా ఉంటుందన్నారు. అనంతరం రౌడీషీటర్లను వారి ఇంటి వద్ద పోలీసులు అప్పగించారు.

పోలీసు సేవల్లో ద్వారకా టాప్

- వివిధ కేటగిరీల్లో సత్తాచాటిన జోన్ పోలీసులు
- క్రైమ్ ఇన్వెస్టిగేషన్, ట్రాఫిక్ నిర్వహణల్లో అవార్డులు



ఉత్తమ విచారణాధికారి కేటగిరిలో అవార్డు అందుకుంటున్న సీఐ ఇమ్మానియేల్ రాజు



ఉత్తమ ట్రాఫిక్ నిర్వహణ కేటగిరిలో అవార్డు అందుకుంటున్న సీఐ ప్రసాద్

ఎంవీపీ కాలనీ: ఉత్తమ సేవల ప్రతిభా అవార్డుల్లో ద్వారకా జోన్ పోలీసులు సత్తా చాటారు. వివిధ కేటగిరీలో ఉత్తమంగా నిలిచి అవార్డులు కైవసం చేసుకున్నారు. నగర పోలీసు కమిషనరేట్ పరిధిలో ప్రతిభ కనబరిచిన పోలీసులకు గణతంత్ర వేడుకల్లో భాగంగా నగర సీపీ ఆధ్వర్యంలో ఇటీవల అవార్డులు ప్రదానం చేశారు. బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ఈ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. నగర పోలీసుల కేటగిరీలో ద్వారక జోన్‌కు చెందిన నలుగురు పోలీసులు అవార్డులు గెలుచుకుని ద్వారక జోన్‌ను నగరంలోనే టాప్‌లో నిలిపారు. క్రైమ్ ఇన్వెస్టిగేషన్, ట్రాఫిక్ నిర్వహణలో ఉత్తమ ప్రతిభా అవార్డులు అందుకున్నారు. దీంతో పాటు ఎంవీపీ కాలనీ పోలీసు స్టేషన్ ఉత్తమ క్రైమ్ పోలీసు స్టేషన్‌గా ఎంపికైంది.

నలుగురికి అవార్డులు

ద్వారాక జోన్ పరిధిలో మూడు పోలీసు స్టేషన్లు సేవలు అందిస్తున్నాయి. ఎంవీపీ కాలనీ, ద్వారకా(ఫోర్త్‌టౌన్), ఆరిలోవ పోలీసు స్టేషన్ల పరిధిలో జోన్ పోలీసులు సేవలు అందిస్తున్నారు. జోన్‌కు చెందిన నలుగురు పోలీసులు అవార్డులు గెలుచుకుని జోన్‌ను టాప్‌లో నిలిపారు. ద్వారకా జోన్ ట్రాఫిక్ సీఐ కేఎస్‌వీఎస్ ప్రసాద్ ఉత్తమ ట్రాఫిక్ నిర్వహణ కేటగిరీలో, జోన్ క్రైమ్ సీఐ టి.ఇమ్మానియేల్‌రాజు ఉత్తమ విచారణాధికారి కేటగిరీలో, ఎంవీపీ క్రైమ్ ఏఎస్ఐ డి.కిశోర్‌బాబు ఉత్తమ సహాయక విచారణాధికారి కేటగిరీలో అవార్డులు అందుకున్నారు. ఎంవీపీ క్రైమ్ ఎస్ఐగా సేవలు అందిస్తున్న ఒ.సురేష్ కుమార్ ఉత్తమ క్రైమ్ పోలీసు స్టేషన్ కేటగిరీలోను అవార్డు అందుకున్నారు. పలువురు ఉన్నతాధికారులు వారిని ప్రశంసలతో ముంచెత్తారు.

మరింత బాధ్యత పెరిగింది




ప్రజా రవాణాకు అనుగుణంగా ట్రాఫిక్ నిర్వహణలో తీసుకున్న చర్యల్లో భాగంగా ఉత్తమ ట్రాఫిక్ నిర్వహణాధికారిగా అవార్డు రావడం ఆనందంగా ఉంది. విధి నిర్వహణ దిశగా మమ్మల్ని ప్రోత్సాహించడంతో పాటు మరింత మెరుగైన సేవలు దిశగా ముందుకు నడిపించడానికి ఈ అవార్డులు దోహదపడతాయి. ఈ అవార్డు విధి నిర్వహణపై మరింత బాధ్యతను పెంచింది. ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా ఉత్తమ ట్రాఫిక్ సేవలు అందించేందుకు చిత్తశుద్ధితో పని చేస్తాం.

– కేఎస్‌వీఎస్ ప్రసాద్, ట్రాఫిక్ సీఐ, ద్వారకా జోన్

వేటూరి గీతాలతో సంగీత విభావరి రేపు

సీతంపేట: సినీ గేయ రచయిత వేటూరి సుందర రామ్మూర్తి 88వ జయంతి సందర్భంగా ఆత్రేయ స్మారక కళాపీఠం ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీ మంగళవారం సాయంత్రం 6 గంటలకు డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రం ఆడిటోరియంలో వేటూరి రచించిన చిత్ర గీతాలతో సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్లు కళా పీఠం కార్యదర్శి గంటి మురళి తెలిపారు. ఈ సందర్భంగా సినీ నేపథ్య గాయని గాలిదేవర సాహితిని వేటూరి యువ గాయని పురస్కారంతో సత్కరిస్తున్నట్టు చెప్పారు. సినీ గాయని సాహితి, రమేష్ పట్నాయక్, శంబర జోగారావు, బాల గణేష్, హారిక, పట్నాయక్, లిపికా రెడ్డి తదితరులు వేటూరి గీతాలను ఆలపిస్తారన్నారు.

అంతర్జాతీయ న్యాయస్థానం తీర్పును అమలు చేయాలి



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న భారత నాస్తిక సమాజం ప్రతినిధులు

సీతమ్మధార : ఇజ్రాయిల్–పాలస్తీనా అంతర్జాతీయ న్యాయస్థాన తీర్పును పాటించాలని భారత నాస్తిక సమాజం ప్రతినిధులు కోరారు. ఆదివారం భారత నాస్తిక సమాజం ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ప్రతినిధులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కన్వీనర్ టి.శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ అంతర్జాతీయ న్యాయస్థానం ఇచ్చిన తీర్పును ఇజ్రాయెల్ పాటించాలని, మూడు నెలలుగా జరుపుతున్న మారణ హోమం ఆపాలన్నారు. బడి పిల్లలపై, ఆస్పత్రుల మీద, బజార్లలోని జన సమూహాలపై దాడులు చేయడం ద్వారా వందలాది మంది మరణించారన్నారు. ఇజ్రాయెల్ వెంటనే కాల్పుల విరమణ పాటించాలని, శాంతి చర్చలు కొనసాగించాలన్నారు. రాష్ట్ర కమిటీ సభ్యులు శ్యామల మాట్లాడుతూ ఇరాన్‌లో ఆడవాళ్లపై జరుగుతున్న మారణకాండకి వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కమిటీ కన్వీనర్ మురళి, చార్వక, రషీద్, కర్రి మల్లేశం, రెండు తెలుగు రాష్ట్రాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'దురుద్దేశంతోనే రాజీనామా ఆమోదం'

ఎంవీపీ కాలనీ: దురుద్దేశంతోనే తన రాజీనామాను ఆమోదించారని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ఆరోపించారు. ఆదివారం ఎంవీపీ కాలనీలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. విశాఖ జిల్లాలో సిద్ధం పేరిట నిర్వహించిన బహిరంగ సభపై విమర్శలు చేశారు. బహిరంగ సభలో ముఖ్యమంత్రి జగన్ అన్ని అబద్ధాలే చెప్పారన్నారు. గతంలో ఇచ్చిన హామీల్లో కేవలం 15 శాతం మాత్రమే అమలు చేశారని చెప్పారు. రాజ్యసభ ఎన్నికల్లో టీడీపీ ఓటు శాతం తగ్గించడానికి ప్రభుత్వం కుట్ర పూరితంగా తన రాజీనామాను ఆమోదించిందన్నారు. దీనిపై న్యాయ పోరాటానికి ఇప్పటికే హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు.

30న దుకాణాలు, మార్కెట్లకు వేలం

కంచరపాలెం: జోన్-5 పరిధిలో ఖాళీగా ఉన్న జీవీఎంసీ దుకాణాలు, కల్యాణ మండపాలు, రోడ్డు పక్కన మార్కెట్లకు ఈ నెల 30న జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయంలో వేలంపాట నిర్వహించనున్నట్లు జెడ్సీ కృష్ణ తెలిపారు. మంగళవారం ఉదయం 10.30 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. సంజీవయ్య కాలనీ, అశోక్‌నగర్, గుల్లలపాలెంలోని దుకాణాలకు, కంచరపాలెం నేతాజీ వంతెన నుంచి మర్రిపాలెం వరకు, అక్కయ్యపాలెంలో రోడ్డు పక్కన మార్కెట్లు, జనతా కాలనీలో కారం మార్కెట్, తాటిచెట్లపాలెం రోడ్ పక్కన మార్కెట్లకు, మాధవధారలోని మాధవ స్వామి కల్యాణ మండపానికి వేలం జరుగుతుందని చెప్పారు.